నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 10 ఏప్రిల్ 2025 | HYDERABAD




రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. – మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 9



హిందూ శ్మశాన వాటికలో డంప్ యార్డును తొలగించే వరకు పోరాడుతామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో మచ్చ బొల్లారంలోని హిందూ శ్మశానవాటిక సంరక్షణ సమితి నాయకులతో చర్చించారు. హిందూ శ్మశానవాటికను డంప్ యార్డ్‌గా మార్చడం హేయమైన చర్య అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. – మల్కాజిగిరి, ఏప్రిల్ 9

# భూమ్ రాంగ్..!!

## రివర్స్ గేర్‌లోకి కేబీఆర్ పార్కు ప్రాజెక్టులు

రూ.1090 కోట్లతో కేబీఆర్ పార్కు చుట్టూ వంతెనలు, అండర్‌పాస్‌లు

- భూసేకరణలో వెంటాడుతున్న అడ్డంకులు
- ఆస్తుల సేకరణపై స్పష్టత లేకుండానే ఆగమేఘాల మీద టెండర్లు
- 12 రోజులు దాటినా.. సమావేశం కానీ టెండర్ కమిటీ
- విమర్శల పాలవుతున్న అధికారుల పనితీరు

సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): హెచ్ సిటీ ప్రాజెక్టు పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేబీఆర్ పార్కు చుట్టూ రూ. 1090 కోట్లతో స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 299 ఆస్తులను స్థల సేకరణకు గుర్తించి, 112 ఆస్తులకు సంబంధించి మార్కింగ్ చేశారు. స్థల సేకరణలో అడ్డంకులు తలెత్తడం...కొందరు భూ సేకరణకు వ్యతిరేకంగా న్యాయస్థానాలను ఆశ్రయించడంతో భూ సేకరణ ప్రక్రియ సాగలేదు. ప్రాజెక్టు పురోగతిలో ఉందని న్యాయస్థానంలో చెప్పుకొనే ప్రయత్నంలో భూసేకరణపై స్పష్టత లేకుండానే పనులకు సంబంధించి అధికారులు ఇటీవల టెండర్లను సైతం పిలిచారు. ప్రముఖ కంపెనీలు మెగా, కేఎన్ఆర్, ఎంవీఆర్‌లు పాల్గొన్నాయి. టెండర్ కమిటీ అర్హత కలిగిన కంపెనీకి పనులు అప్పగించాల్సిన తరుణంలో టెండర్ ప్రక్రియను పూర్తి చేసే సాహసం చేయడం లేదు.



### టెండర్ కమిటీ కాలాయాపన

కేబీఆర్ పార్కు చుట్టూ సినీ, రాజకీయ ప్రముఖులు చాలా మంది ఉన్నారు. వీరిలో ప్రధానంగా అధికార పార్టీ మాజీ మంత్రి జానారెడ్డి, సినీ హీరో బాలకృష్ణ, మరో సినీ హీరో అల్లు అర్జున్ మామ కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి , ఇతర పారిశ్రామిక, వ్యాపారవేత్తలు ఉన్నారు. ఖరీదైన స్థలాలు కావడంతో చాలా మంది స్థలాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఇందులో ఇప్పటికే కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. వాస్తవంగా ప్రాజెక్టు పనులు చేపట్టాలంటే ముందుగా భూ సేకరణ అత్యంత కీలకం. భూ సేకరణపై స్పష్టత వచ్చాకే పనులకు సంబంధించి ప్రక్రియ ప్రారంభించాలి. కానీ ఇక్కడ భూసేకరణ అడ్డంకులను తొలగించకముందే టెండర్లు పిలిచి ....అంతేస్థాయిలో టెండర్ కమిటీ కాలాయాపన చేస్తుండడం ప్రత్యేక చర్చకు దారి తీసింది. పురపాలక డిప్యూటీ సెక్రటరీ, పబ్లిక్ హెల్త్ విభాగం ఈఎన్సీ, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్, జలమండలి డైరెక్టర్, ఫైనాన్స్ విభాగం సీనియర్ అధికారులతో కూడిన కమిటీ సమావేశంలో ఎజెన్సీ ఫైనల్ చేయాల్సి ఉంది. తర్వాత ఫైనాన్షియల్ బిడ్‌ను సైతం తెరిచి ఎజెన్సీ ఖరారు చేయాల్సి ఉంటుంది. కానీ టెక్నికల్ బిడ్లు తెరిచి 12 రోజులు కావొస్తున్న కమిటీ సమావేశం నిర్వహించకపోవడంతో ప్రాజెక్టు పనులు ప్రశ్నార్థకంగా మారింది.

### సవాల్‌గా మారిన భూ సేకరణ

దాదాపు రూ. 741 కోట్ల వరకు భూసేకరణకు ఖర్చు అవుతుందని, 56,621.30 చదరపు గజాల విస్తీర్ణం ఉన్నట్లు అంచనా వేశారు. విరించీ దవాఖాన నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్ వరకు 6.50 కి.మీ పొడవు 100 ఫీట్ల నుంచి 120 ఫీట్ల వరకు రోడ్డు విస్తరించాలని నిర్ణయించి.. 81 ఆస్తులను సేకరించాలని భావించారు. కేబీఆర్ పార్కు ఎంట్రన్స్, ముగ్ధ జంక్షన్ పరిధిలో 40, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్ 47, మహారాజా అగ్రసేన్ జంక్షన్‌లో 34, ఫిలింనగర్‌లో 43, రోడ్డు నంబర్ 45లో 36, క్యాన్సర్ ఆసుపత్రి జంక్షన్‌లో 18 ఆస్తులను సేకరించాల్సి ఉంది. న్యాయస్థానంలో కేసులు పడుతుండడంతో ఆస్తుల సేకరణకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేయడం లేదు.

## బర్త్‌డే ముసుగులో.. ముజ్రా




### భగ్నం చేసిన ఎస్‌వోటీ..పలువురిపై కేసు

మొయినాబాద్, ఏప్రిల్ 9: బర్త్‌డే పార్టీ ముసుగులో కొనసాగుతున్న ముజ్రా పార్టీని ఎస్‌వోటీ పోలీసులు, మొయినాబాద్ పోలీసులు సంయుక్తంగా భగ్నం చేశారు. పలువురు యువతీ, యువకులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బోరబండ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మహ్మద్ లుఖ్మార్ తన బర్త్‌డే వేడుకలను రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని ఎతుబార్‌పల్లి రెవెన్యూలో గల హాలీడే హోమ్ ఫామ్ హౌస్‌లో నిర్వహించేందుకు మంగళవారం సాయంత్రం వచ్చారు. బర్త్ డే ముసుగులో ముజ్రా పార్టీని కూడా ఏర్పాటు చేసుకున్నారు.యువతులకు,యువకులకు మద్యం, గంజాయి మత్తెక్కించి అర్ధనగ్నంగా అశ్లీల నృత్యాలు చేయించారు. అసాంఘిక కార్యక్రమాలు సైతం నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందడంతో మొయినాబాద్ పోలీసులతో కలిసి మంగళవారం రాత్రి 11:30 గంటలకు ముజ్రా పార్టీ శిబిరంపై దాడులు నిర్వహించి.. భగ్నం చేశారు. మద్యం, గంజాయి, నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న యువతులు,యువకులతో పాటు మహ్మద్ లుక్మార్, ఫామ్ హౌస్ యజమాని అబ్దుల్ బీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



తమను క్రమబద్ధీకరించాలంటూ బుధవారం మాసబ్ ట్యాంక్ లోనే ఉన్నత విద్యా మండలి కార్యాలయాన్ని కాంట్రాక్ట్ అధ్యాపకులు ముట్టడించారు. ఈ సందర్భంగా మాసబ్ ట్యాంక్ ప్రధాన రోడ్డుపై కాంట్రాక్ట్ అధ్యాపకులు బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. –మెహిదీపట్నం, ఏప్రిల్ 9



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

## రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

సిటీబ్యూరో/కార్వాన్: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించే ఈ సభను చరిత్రలో నిలిచిపోయే రోజుగా మలుద్దామని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కార్వాన్ నియోజకవర్గంలోని రాంసింగ్‌పురాలో జరిగిన భారీ సన్నాహక సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి శ్రవణ్ మాట్లాడారు. బీఆర్ఎస్ పదేండ్ల అభివృద్ధి పాలనను, కాంగ్రెస్ సర్కారు విధ్వంసాన్ని ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సంక్షోభంలోకి నెట్టేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు జీవన్‌సింగ్, శ్రీనివాస్ గుప్తా, శేఖర్ రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ వైఫల్యం వల్లే..సిటీలో నీటి సమస్య

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



జలమండలి, బల్దియా అధికారులతో కలిసి ఎన్టీఆర్ నగర్ ఫేస్–3 లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఆర్కే పురం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యంతోనే నగరంలో మంచినీటి సమస్య ఏర్పడిందని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కే పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ పేస్– 3 లో మంచినీటి సమస్య ఉందని తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం జలమండలి, బల్దియా అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పర్యటించి స్థానికులను నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నిరంతరంగా నీరందించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 3 నెలలుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. మహానగరంలో ఏ వీధిలోకి వెళ్ళిన ప్రజలు నీటి సమస్య గురించి ప్రస్తావిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు నగేశ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నల్లాకు మోటర్ బిగిస్తే రూ.5వేలు జరిమానా





సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): నల్లాల నుంచి మోటర్ల ద్వారా నీటిని తోడితే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. జలమండలి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఓ అండ్ ఎమ్ సీజీఎం, జీఎం లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... 'మోటర్ ఫ్రీ టాప్ వాటర్' పేరుతో ఈ నెల 15 నుంచి వాటర్ స్పెషల్ డ్రైవ్ అమలు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఎవరైనా వినియోగదారులు తమ నల్లాలకు మోటర్లు బిగించి పట్టుబడితే.. వారిపై జలమండలి నిబంధనల ప్రకారం రూ.5వేలు జరిమానా విధించడంతోపాటు మోటర్లు సీజ్ చేస్తామని చెప్పారు.

## అనుమతి లేకుండా..




బంజారాహిల్స్, ఏప్రిల్ 9: పరిమితికి మించి శబ్ద కాలుష్యం కలిగించేలా డీజే ద్వారా మ్యూజిక్ ప్లే చేస్తున్న పబ్ నిర్వాహకులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని హయత్ ప్లేస్ హోటల్ టెర్రస్ మీద నడుస్తున్న జింగ్ స్కై బార్ అండ్ లాంజ్ పేరుతో నడుస్తున్న పబ్‌లో అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేయడంతో పాటు భారీగా మ్యూజిక్ ప్లే చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన డీజే మిక్సర్, లైవ్ మిక్సర్‌తో పాటు స్పీకర్లు ఇతర సామగ్రిని సీజ్ చేసిన పోలీసులు.. పబ్ మేనేజర్ రోబిన్ సహాయ్, సెక్యూరిటీ మేనేజర్ రామానుజులు, డీజే అపరేటర్ నరేన్ కుమార్ తదితరులపై చర్యలు తీసుకోవాలంటూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## స్పెషల్ డ్రైవ్



సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఎర్లీబర్డ్ పథకం ద్వారా రూ.1000 కోట్ల పన్ను వసూలు చేయాలని లక్ష్యాన్ని ఖరారు చేసిన కమిషనర్..టార్గెట్ చేధించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. 30వ తేదీ వరకు ఆస్తిపన్ను చెల్లించిన వారికే ఈ 5 శాతం రిబెట్ ఉంటుందని ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు ప్రకటించారు. బుధవారం వరకు 2.4 లక్షల మంది ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకోగా...తద్వారా రూ. 147 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెలాఖరు నాటికల్లా లక్ష్యాన్ని చేరాలని ఆ దిశగా డీసీలు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఎస్ఎంఎస్‌లు చేర్చడం, విస్తృత అవగాహన కల్పించనున్నారు.

## ఫీజు చెల్లించలేదని.. పరీక్ష రాయనివ్వలేదు..



విద్యార్థులపై హోలీ మేరీ హై స్కూల్ యాజమాన్యం ఆక్రోశం
భగ్గుమన్న తల్లిదండ్రులు..ప్రిన్సిపాల్ తీరుపై ఆగ్రహం
మళ్లీ పరీక్ష రాయించే అవకాశం కల్పిస్తామని హామీతో శాంతించిన పేరెంట్స్

మెహిదీపట్నం: ఫీజు చెల్లించని విద్యార్థులకు ప్రశ్నాపత్రం ఇవ్వకుండా హోలీ మేరీ హై స్కూల్ యాజమాన్యం మొదటిరోజు పరీక్ష రాయనివ్వలేదు. దీంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. వీరికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారా లేక ఫెయిల్ చేస్తారా అని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. అయితే మాసబ్ ట్యాంక్ లోని హోలీ మేరీ హై స్కూల్ యాజమాన్యం ఫీజు చెల్లించలేదనే కారణంగా విద్యార్థుల పట్ల ఆక్రోషాన్ని ప్రదర్శించింది. రూ.1000, రూ.2000 బకాయిలు ఉన్న విద్యార్థులను కూడా మొదటిరోజు పరీక్షలు రాయనివ్వకుండా అడ్డుకున్నారు. స్కూల్ ఫీజు చెల్లించని విద్యార్థులకు హాల్ టికెట్లను జారీ చేసినా..పరీక్ష రాయించినా ఉద్యోగంలో నుంచి పీకేస్తానంటూ ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ మీనా వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులు పరీక్ష హాల్లో కూర్చున్న, ఫీజు చెల్లించని విద్యార్థుల చేతుల్లోని ప్రశ్నపత్రాలను జవాబు పత్రాలను లాక్కున్నారు. గంటలపాటు విద్యార్థులను పరీక్ష హాల్ బయటే నిల్చో పెట్టారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హోలీ మేరీ హై స్కూల్ ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యార్థులను పరీక్షలు రాయనివ్వకుండా వేధింపులకు గురిచేయడాన్ని తల్లిదండ్రులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం తక్షణమే హోలీ మేరీ హై స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ పై తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మొదటి రోజు పరీక్ష రాయని తమ పిల్లల భవిష్యత్ ఏమిటని తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ మీనాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రిన్సిపాల్.. పరీక్ష రాయని విద్యార్థులకు చివరి రోజున మళ్లీ పరీక్ష రాయించే అవకాశం కల్పిస్తామని సమాధానం ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా, ఆసిఫ్‌నగర్ మండల డిప్యూటీ డీవో రమణ రాజును వివరణ కోరగా గురువారం పరీక్ష రాయిస్తామని చెప్పారు.

## చేజారుతున్న ప్రాజెక్టులు

హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందించినా... నిర్మాణ బాధ్యతలు ఇతర విభాగాలకు

సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు చేతి నిండా ప్రాజెక్టులు.. గల్లా పెట్టె నిండేలా రెవెన్యూ మార్గాలు. ఇంకేముంది కొత్త ప్రాజెక్టులకు ప్రణాళికలు రూపొందించడమే ఆలస్యం... చకచకా ప్రాజెక్టులను పట్టాలెక్కించిన హెచ్ఎండీఏ... ఇప్పుడు నిధుల్లేక చేతులెత్తేస్తున్నది. ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినా... నిధుల్లేక ఇతర సంస్థలకు మళ్లించాల్సి వస్తోంది. ఎన్నో ప్రాజెక్టులు హెచ్ఎండీఏ చేతుల నుంచి జారిపోతున్నాయి. దీనికి హెచ్ఎండీఏకు నెలవారీగా వచ్చే ఆదాయం లేకపోవడమేననే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. హైదరాబాద్ నగరాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో హెచ్ఎండీఏ కీలకపాత్ర పోషిస్తోంది. 11 జిల్లాల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు, మెరుగైన రవాణా సదుపాయాలు, ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్‌ల నిర్మాణంలో ముఖ్యభూమికను పోషించే హెచ్ఎండీఏ ఇప్పుడు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను చేజార్చుకుంటున్నది. ఫ్లైఓవర్లు, ట్రక్ పార్కులు, లాజిస్టిక్ హబ్, ఐటీ కారిడార్లు, ఏకో పార్కులు, అర్బన్ ఫారెస్ట్రీలను అభివృద్ధి చేసిన హెచ్ఎండీఏ.. నిధుల్లేక చేతులేత్తేస్తున్నది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం అందకపోవడం... రెవెన్యూ మార్గాలు తగ్గిపోవడం ఇప్పుడు ఆ విభాగాన్ని ఖాళీ చేతులతో కూర్చునేలా చేస్తోంది.

### ప్రాజెక్టు చేపట్టాల్సిన సమాయానికి..

అవుటర్ రింగు రోడ్డు నుంచి రీజనల్ రింగు రోడ్డును అనుసంధానం చేసేలా హెచ్ఎండీఏ గ్రీన్ ఫీల్డ్ హైవేను ఫ్యూచర్ సిటీ మీదుగా హెచ్ఎండీఏ–హెచ్‌జీసీఎల్ డిజైన్ చేసింది. అయితే ఈ ప్రాజెక్టు భూసేకరణ, ప్రాజెక్టు నిర్మాణం అంచనా వ్యయం తదితర అంశాలపై సుదీర్ఘంగా ప్రణాళికలు రూపొందించి ప్రాజెక్టు చేపట్టాల్సిన సమయానికి హెచ్ఎండీఏ చేతుల్లోనుంచి జారిపోయింది. అదేవిధంగా నగరంలో లింకు రోడ్లను నిర్మాణంతో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేలా నగర శివారుల్లో 49 లింకు రోడ్ల ప్రణాళికలను రూపొందించింది. ఈ ప్రాజెక్టును హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నిధులిచ్చిన ప్రభుత్వం... ఆ సంస్థ ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నది. అదేవిధంగా మీరాలం లేక్‌ను సుందరీకరించాలనే లక్ష్యంతో గతంలోనే హెచ్ఎండీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది. కానీ ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టును మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ద్వారా చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది.

## రాగల 24 గంటల్లో వర్ష సూచన



సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాగల 24గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి నమోదవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 36.9 డిగ్రీలు, కనిష్ఠం 23.4 డిగ్రీలు, గాలిలో తేమ 35శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.